స్కెచ్

# 'రియలిస్టు' కరుణాకరం

వల్లూరి కృష్ణారావు

కరుణాకరం మధ్యాహ్నం భోజనంచేసి సిగరెట్టు కాలుస్తూ వీధిగదిలో కుర్చీమీద కునుకుతీసాడు.

వీధినిబడి వంగి వంగి పోతున్నాడు ముసలి పంతులు బడివైపు. ఎన్నేళ్ళయిందో ఆ నల్లకోటు కుట్టించుకొని! బహుశా పంతులు ఉద్యోగంలో ప్రవేశించినప్పుడై ఉంటుంది! శిథిలావస్థలో నున్న ఆకళ్ళజోడు కాళ్ళను దారాలతో ముడి పెట్టాడు పట్టు విడిపడిపోకుండా! బాధతో కనుబొమ్మలు మెలికలు తిరిగాయి కరుణాకరానికి. పంతులు బీదతనం పంతుల్ని ముసలివాణ్ణి చేసిందనుకున్నాడు కరుణాకరం. పంతులు తన కిటికీ దాటి రెండు గజాలయి ఉంటుంది.

"పంతులుగారూ!" కరుణాకరం పిలిచాడు. పంతులు వెనుతిరిగి చూసాడు. "కరుణాకరమా?" అని కరుణాకరం గదిలోకి వచ్చాడు. ఎదురుగా ఉన్న ఒక పాతకుర్చీ చూపించాడు కరుణాకరం, పంతులు కరుణాకరం వైపు చూసాడు. పిలిచిన పనేమిటన్నట్లు.

కరుణాకరం నవ్వుతూ "భోజనం చేసారా?" అన్నాడు.

"ఆ"

"ఎలాఉంది మీ ఉద్యోగం?" కరుణాకరంతిరిగి ప్రశ్నించాడు.

"నా కెప్పుడూ ఇంతవరకూ అలాంటి ఊహ తట్టలేదు. పైగా రెండేళ్ళే ఉంది సర్వీసు. ఎలా ఉంటేం ఇంక?"

"తర్వాత?"

"భగవంతుడు" చాలా తేలికగా అన్నాడు పంతులు. కష్టాలతో నలిగిన మనిషి కనక కష్టాలను చాలా ఓపికతోను, తేలికగానూ భరిస్తున్నట్లుందనుకున్నాడు కరుణాకరం.

"ఇలాంటి వేదాంతం కబుర్లు చెప్పకండి. ప్రతిదానికీ భగవంతుడంటారేమిటి? మీ ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిమాటేమిటి? దానికీ భగవంతుడేనా?"

"అవును" పంతులు చాలా నిర్వికారంగా అన్నాడు.

"మీ ఓర్పును గురించి నేను మెచ్చుకుంటాను. మీ కష్టాలు ఉన్నవి ఉన్నట్టు నాకు చెప్పండి. మీ కమిటీ మీకు చాలా అన్యాయాలు చేసిందని విన్నాను. వివరాలు చెప్పండి. అవి నాకు చాలా అవసరం. అవి ప్రపంచం ముందుపెట్టి, ప్రపంచపు సానుభూతిని మీకు కలిగిస్తాను."

"మీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి, నాకు అన్యాయాలు జరుగుతున్నట్లు నాకు నేనై అనుకోలేదు. మిగతావారు అనుకుంటే నేను బాధ్యుణ్ణికాదు. పైగా నా ఖర్మ అని నేను ఊరుకుంటాను."

"మీరు అలా నొక్కిపెట్టి దాచడానికి వీల్లేదు. నాకు తెలుసు మీరు బాధపడుతున్నారని. మీరు చెప్పాలి"

"నిర్బంధమా?" పంతులు తేలికగా అన్నాడు.

"అవును. నేను రియలిస్టుని. నేను నా చుట్టుప్రక్కల ఉండే ప్రతివ్యక్తీ నా కథల్లో కనపడతాడు. అందులో ఇప్పుడు నే వ్రాయబోయే కథలో మీది ప్రధానపాత్ర."

"నాకు ఇష్టంలేదు, మీకు నా సంగతిపూర్తిగా చెప్పడం. మీ సంగతి ఇప్పుడు నాకు తెలిసింది గనక, ఇంకో జాగ్రత్తగా ఉండాలి నేను."

"అలా వీల్లేదు. ఇందులో మీకేమీ నష్టంలేదు. మీకు ప్రపంచం సానుభూతి దొరుకుతుంది."

"నాకు సానుభూతి అక్కర్లేదు. క్షమించండి."

"మీకు కాకపోవచ్చు. మీలాంటివాళ్ళు సమాజంలో చాలామంది ఉన్నారు. వారికి కావాలి. వారికోసం..."

పంతులు రెచ్చిపోయాడు. "నా పాత్ర కావాలంటారు."

"అదికాదు. ఇది మీకు ఇష్టంలేకపోవచ్చు. మీలాంటివారికోసం అంటే లోకోద్ధరణకోసం మీరు నాకు సహకరించాలి. దీన్ని సహకారం

కూడాకాదు సహాయం అంటాను." కరుణాకరం మెత్తగా మాట్లాడబోయాడు.

"నా సహాయం కావలసిన వారు ఈ మానవాళిలో ఒక్కరయినా ఉన్నారని వినడానికి సంతోషిస్తాను."

పంతులు దారికి వస్తున్నట్లనుకున్నాడు కరుణాకరం. ఎంతో జాలిగా,

"మీరు అలా నిరుత్సాహ పడకండి. ప్రతీ ప్రాణీ ఇంకో ప్రాణికి ఏదోరూపేణా ఆసరా అవుతూనే ఉంటారు. అది తెలుసుకోక..."

"అర్థమయింది మీరుచెప్పేది. ప్రజల వినోదం కోసం నాకష్టాల్ని ఓ కథగా వ్రాస్తానంటారు.అందు కోసం మీకు నేను 'మెటీరియల్'ఇవ్వమంటారు."

"క్షమించండి. మీరుచాలా తెలిసినవారు. నే చెప్పేది మీకు చాలా తక్కువ. వినోదం కోసం వ్రాసేవి కొన్నికథలు ఉపయోగం కోసం వ్రాసేవి కొన్నీ ఉంటాయని తెలియ చేస్తున్నాను."

"మీరు అనవసరంగా కాలాన్ని వృథా చేసుకుంటున్నారు."

పంతులుకి కరుణాకరం హితవుగాలేడు.

"అలా ఎప్పుడూ అనుకోను. మీకు మీరు చెప్పుకోలేక నన్ను చాటుచేసుకొని సభ్యతకోసం అంటున్నారేమోనని భయపడుతున్నాను."

"మాష్టరీ శలవల ఉద్యోగం అంటారుగా కాలక్షేపం అవక కొట్టి మిట్టాడే ఉపాధ్యాయులు కూడా ఉంటారన్నట్లు మీలాంటి రచయితల రచనల్లో ఎప్పుడో చూసేవాడిని...ఇప్పుడుకాదు" పంతులు 'హిట్టులు'కూడా కొడుతున్నాడు.

"ఆ కథకులు వేరు. వారివి ఊహించి వ్రాసిన కథలు. నేను 'రియలిస్టుని' ఊహించి వ్రాసిన వ్రాతలు ప్రకృతి బద్ధంగా కాక చాలా దూరంగా ఉంటాయి. నా పాత్రలు మామూలు మనంలాగా మాట్లాడతాయి."

పంతులు ఒక నిర్ధారణకొచ్చి మాట్లాడుతున్నాడు. "ఏమయినా కానివ్వండి. నేను మీ కథలో పాత్రగా ఉండడానికి మాత్రం అంగీకరించను." ఎవరూ ఇలా మొండిగా మాట్లాడరేమోననిపించింది కరుణాకరానికి. కరుణాకరం కూడా చాలా పెడసరంగానే మాట్లాడాడు..

"మీకు చేటుచేయకుండా మాట్లాడాలంటే మీ ఇష్టమేమీ లేదిందులో. నేను అచ్చు మీలా పాత్రచేత పలికిస్తాను. అందుకు ఏ విధంగానూ మీరేమీ చెయ్యలేరు. పోతే ఒకపట్టాన మీరు సహకరించలేదని గాని."

"మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి. నేను చేసే ఉపకారమేమీలేదు ఇందులో. మీరు వ్రాసే వ్రాతలకు నేనెలా బాధ్యత వహిస్తానో నాకు అర్థం కాకుండాఉంది. పిల్లలు సవాలక్ష కూస్తారు రోడ్ల మీద. ఇంటిలో కుర్రాడి పెంకితనానికి, అల్లరికి మాష్టరు బాధ్యుడన్నట్లు, మీరు సృష్టించే పాత్ర ఔచితికి, అనౌచితికి నేను బాధ్యుడనవుతానంటే నే చెప్పేదీ ఏమీ ఉండదు."

కరుణాకరానికి పచ్చివెలక్కాయ నములుతున్నట్లుంది. చిరాకుపడ్డాడు. "మీ ఈ మొండి జవాబు నాకు బాధకలిగిస్తోంది. కాని చిత్రం! ఇందులో ఒక వైరుధ్యాన్ని చూస్తున్నాను. నేను మిమ్మల్ని దృష్టిలో ఉంచుకొని సృష్టించే పాత్ర అపశ్రుతి పలుకుతోంది. నేను సృష్టించే పాత్ర ఇంత కటువుగా, మొండిగాఉండదు. ఎంతో జాలి కావలసినదిగా, జాలికి మొహం వాచినదానిలా ఉంటుంది."

పంతులు ఒక్కబాటు లేడిలా లేచి, కరుణాకరం కళ్ళల్లోకి పొడిచిచూస్తూ ఇలా అన్నాడు: "ఒక్కమాట అడుగుతాను చెప్పండి. నా ఉద్యోగం గురించి, నా యోగక్షేమం గురించి, నా పిల్లల పెళ్ళిళ్ళగురించి అడిగార్లే నాకుమాత్రం అక్కర్లేదనుకున్నారా మీ యోగక్షేమాలు. మీ వ్యాపారం ఎలావుంది? అంటే కథలువ్రాసుకు బ్రతకడం. మీ అమ్మాయికి యుక్తవయస్సు వచ్చినా పెళ్ళికాలేదని విన్నాను. మీ అమ్మాయికి పెళ్ళి చేయరేమిటి? మీరు అప్పులుచేయవలసిన ఖర్మేం పట్టింది? మీకు సానుభూతి అక్కర్లేదా? మాకేనా కావలసింది! మీరు మీ పాత్రను సృష్టించుకొని ప్రపంచ సానుభూతి ఎందుకు పొందకూడదు?" పంతులు కరుణాకరం సమాధానంకోసం ఆగలేదు.

కరుణాకరం డస్సిపోయాడు. తల తిరిగింది. కాలుతున్న సిగరెట్టు వేలికితగిలి చుర్రు మంది. అబ్బా! అంటూ లేచాడు మైకంలోంచి. ★